క్లుప్తంగా

హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పల్లవి



కుప్పం: కుప్పం నియోజకవర్గానికి నూతనంగా మంజూరు చేసినా హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టును ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలో హార్టికల్చర్ అధికారిగా పనిచేస్తున్న టీపీ పల్లవిని పదోన్నతిపై కుప్పం హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారు. ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. హార్టికల్చర్ శాఖకు కుప్పంలో ప్రత్యేక కార్యాలయం లేకపోవడంతో పెద్దబంగారునత్తం వద్ద ఉన్న హార్టికల్చర్ హబ్ కార్యాలయం నుంచి పాలనను కొనసాగిస్తామని తెలిపారు.

తిరువణ్ణామలైకి ఆర్టీసీ బస్సులు ప్రారంభం



తిరువణ్ణామలైకి వెళ్లే బస్సుల వద్ద అధికారులు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణం నుంచి తమిళనాడులోని తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కెసి.పావని తెలిపారు. ఆమె గురువారం జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ప్రతి నెలా పుంగనూరు డిపో నుంచి 6 నుంచి 10 బస్సుల వరకు నడుపుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కుప్పంరూరల్: గుడుపల్లె మండలం, బిసానత్తం రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. సుమారు 65 సంవత్సరాల వయసు కలిగి నీలి రంగు షర్టు, నల్లటి నిక్కరు ధరించి నట్లు తెలిపారు. గురువారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని చెప్పారు. తల మొత్తం గుర్తు పట్టలేనంతగా నుజ్జు నుజ్జు అయ్యిందని చెప్పారు. సమీప ప్రాంతాల్లో ఎవరైనా 65 సంవత్సరాల వ్యక్తి తప్పిపోయి ఉంటే కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఆచూకీ తెలిసిన వారు బంగారుపేట రైల్వే పోలీసులు 9480802120, 815325530 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంఈవో

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం, సీఎం కండ్రిగ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు గురువారం సర్పంచ్ గాలి మహేష్ బాబు రూ.16 వేల విలువైన విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలు చేరుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఇంటి వద్ద ఒకటికి రెండు సార్లు చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గిరిజ, హెచ్‌ఎంలు చంద్రశేఖర్, ప్రకాష్, టీచర్ కోదండయ్య, సీఆర్పీ రాజేశ్వరి, వీఆర్వో శ్రీనివాసులు, చందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పనిచేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: అధికారులు పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ యువరాజు సూచించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై మండలానికి వచ్చిన పంచాయతీ సెక్రటరీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని పేర్కొన్నారు. కులం, మతం, పార్టీలకు తావు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో వుండి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని గూడూరుపల్లె వద్ద గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సులకు సంబంధించి అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసురెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్, మెకానిక్, డీజిల్, సివిల్, వెల్డర్, ఫ్యాషన్ డిజైన్ తదితర కోర్సులకు సంబంధించి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్సుల్లో చేరే వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈ నెల 15లోపు కళాశాలలో సంప్రదించాలన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



భూమన కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రాతివారిపల్లెలో గురువారం నియోజకవర్గస్థాయి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు హామీల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పేరుతో ఊదరగొట్టారని గుర్తు చేశారు. వాటిని పూర్తిగా అమలుచేశామని చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేసిన మోసాలను కూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించాల్సి ఉందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వారితో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు అండ్ కో చేస్తున్న మోసాలను కళ్లకు కట్టినట్టు వివరించాలన్నారు. కొన్నిచోట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య మనస్పర్థలు వున్నాయని, వాటిని పక్కన పెట్టి పార్టీ కోసం కలిసి పనిచేయాలని కోరారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తమ వెంట నడుస్తున్న ప్రజల రుణం తీర్చుకోలేమని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం వల్లే తాము మరోసారి గెలుపొందామని వివరించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళ్యం పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలు వస్తే కూటమికి ఓటమి తప్పదు

చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తను పెద్దిరెడ్డి కుటుంబ కంటికిరెప్పలా కాపాడుకుంటుందని చెప్పారు. రేయింబవళ్లు కష్టపడి పని చేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, దామోదరరాజు, రెడ్డీశ్వర రెడ్డి, ఎంపీపీలు భాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, ఈశ్వరయ్య, పురుషోత్తంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, చెంగారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, భరత్, ఇమ్రాన్, పుత్రాజు, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

బైరెడ్డిపల్లి: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పరిషత్ సీఈవోతో కలిసి మండల అధికారులతో తాగునీటి సమస్యపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి వెంటనే నూతన బోర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత పెరిగేకొద్దీ తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం వుంటుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు జిల్లా పరిషత్ నిధులను వినియోగించి ఉన్నతాధికారుల సూచనల మేరకు నూతన బోర్లు వేయించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, ఎంపీడీవో రాజేంద్ర, బాలాజీ, నాగార్జునరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, జూనియర్ బాలికల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్రమణ్యం తెలిపారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని రిటైర్డ్ సైంటిస్ట్ కరీముల్లా సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హరిబాబు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సేవలో ఎమ్మెల్యే



అయ్యప్పస్వామి సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయాన్ని గురువారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందర్శించారు. ఆయన తిరుపతిలో మాలధారణ చేసిన అనంతరం ఇక్కడికి వచ్చారు. ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వర, అయ్యప్ప ఆలయాల్లో పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కొండవీటి నాగభూషణం, జింకా చలపతి, అమర్నాథ్ రెడ్డి, కల్యాణ భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియామకం

పలమనేరు : పలమనేరు మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పలమనేరు మున్సిపాలిటీ యూత్ వింగ్‌కు రాజేష్, మహిళా విభాగానికి పుష్ప, రైతు విభాగానికి రెడ్డెప్పరెడ్డి, బీసీ సెల్‌కు ప్రకాష్, ఎస్సీ సెల్‌కు గణేష్, ఎస్టీ సెల్‌కు నవీన్, మైనారిటీ సెల్‌కు మన్సూర్, స్టూడెంట్ వింగ్‌కు మంజు, పీఆర్‌కు రఘు, ఆర్‌టీఐ అబ్దుల్లా, వలంటీర్స్‌కు ఖాదర్, గ్రీవెన్స్‌కు సుభాష్, వాణిజ్యానికి అబ్జల్, వైఎస్సార్ టీయూసీకి మహేష్, కల్చరల్‌కు రమేష్, సోషల్ మీడియాకు షబీర్, ఐటీకి కిశోర్, మేధావుల ఫోరానికి హరీష్‌నాయుడు, పబ్లిసిటీకి ఆల్తాఫ్, డాక్టర్స్‌కు జహీర్, బూత్ కమిటీలకు హేమంత్‌యాదవ్, క్రిష్టియన్ మైనారిటీ సెల్‌కు కిరణ్, మున్సిపల్ వింగ్‌కు రామక్రిష్ణ, వీవర్స్‌కు చక్రవర్తి, లీగల్ సెల్‌కు హరిక్రిష్ణారెడ్డి నియమితులయ్యారు.

బైరెడ్డిపల్లె మండలంలో..

బైరెడ్డిపల్లె : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురిని అనుబంధ విభాగాల మండల అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. బైరెడ్డిపల్లె మండల యూత్ అధ్యక్షుడిగా వి.మహేష్ బాబు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా ఉమా మహేశ్వరి, రైతు విభాగంలో జనార్ధన్‌రెడ్డి, బీసీ సెల్ విభాగంలో డి.పీరూసాబ్, ఎస్సీ సెల్ విభాగంలో పి.నారాయణస్వామి, ఎస్టీ సెల్ విభాగంలో వై.భాస్కర్, విద్యావిభాగంలో జనార్ధన్, కార్యవర్గ సభ్యులుగా మధుకుమార్, ఫైజుల్లా, షాకీర్‌హుసేన్, కేశవులు, శంకరాచారి, సురేష్‌రెడ్డి, నాగరాజు, అమరనాథరెడ్డి, జయకుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, సోమశేఖర్‌రెడ్డి, బాలాజీ, మంజునాథ్, శకుంతల, గజేంద్ర నియమితులయ్యారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండల యూత్ వింగ్‌కు సునిల్ రెడ్డి, మహిళా విభాగానికి ఆంజమ్మ, రైతు విభాగానికి విశ్వనాథరెడ్డి, బీసీ సెల్‌కు మణి, ఎస్సీ సెల్‌కు సుబ్రమణ్యం, ఎస్టీ సెల్‌కు సుదేష్, మైనారిటీ సెల్‌కు జాఫర్, స్టూడెంట్ వింగ్‌కు రంజిత్, పంచాయతీ రాజ్ వింగ్‌కు లతీఫ్, ఆర్టీఐ వింగ్‌కు జయరామ్, వలంటీర్స్ వింగ్‌కు మొగిలీశ్వర, గ్రీవెన్స్ సెల్‌కు మంజునాథ్‌రెడ్డి, వాణిజ్య విభాగానికి జగన్నాథం, వైఎస్సార్ టీయూసీకి ధన, లీగల్ సెల్‌కు ప్రభాకర్ రెడ్డి, కల్చరల్ వింగ్‌కు ఓబుల్ రెడ్డి, సోషల్ మీడియా వింగ్‌కు మనోహర్ రెడ్డి, ఐటీ వింగ్‌కు మహేష్, మేధావుల ఫోరానికి గుర్నాథరెడ్డి, పబ్లిసిటీకి బాలాజీ, బూత్ కమిటీలకు సురేష్ రెడ్డి నియమితులయ్యారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎస్‌కె.రమణారెడ్డి, రతీదేవి, కుటుంబ సభ్యులు



సదుంలో పూజలు అందుకుంటున్న సాయిబాబా



పుంగనూరు సమీపంలోని మాదనపల్లెలో ప్రత్యేక అలంకారంలో శ్రీషిరిడీ సాయిబాబా

కుప్పం రూరల్: కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డు, మోడల్ కాలనీలో వున్న సాయిబాబా మందిరాల్లో గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి ప్రాకారోత్సవం చేపట్టారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లె బజారువీధిలోవున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబాకు ఆలయ నిర్మాణ దాత, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌కె.రమణారెడ్డి, రతీదేవి పట్టువస్త్రాలు సమర్పించారు. బాబాను వెండి సింహాసనంపై ప్రత్యేకంగా అకలంకరించి ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సదుంలో..

సదుం: మండలంలోని సాయిమందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పాలాభిషేకం, అర్చన చేశారు. ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కరెంటు బాబు దంపతులు మేళతాళాలతో వచ్చి బాబాకు పట్టువస్త్రాలు సమర్పించారు.

రొంపిచెర్లలో.. రొంపిచెర్ల: రొంపిచెర్లలోని సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సాయిబాబాను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఓ.శ్రీనివాసులు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు(చౌడేపల్లె): గురుపౌర్ణమి సందర్భంగా పుంగనూరు పట్టణంలోని కొత్తయిండ్లలో వున్న శ్రీసాయిబాబా, చెరువుకట్టపైనున్న సాయి, దత్త ఆలయం, యాబైరాళ్ల మొరవలో వున్న శ్రీదత్త క్షేత్రము, మాదనపల్లెలో గల శ్రీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సాయినాథున్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

రొంపిచెర్ల: వివిధ కేసుల్లోవున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఆయన గురువారం రొంపిచెర్ల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసుల రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరాల అదుపునకు రాత్రిళ్లు గ్రామాల్లో గస్తీ చేపట్టాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఉచిత టైలరింగ్ శిక్షణపొందుతున్న మహిళలకు గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వేధింపులకు గురవుతున్న మహిళల రక్షణ కోసం ప్రభుత్వం 2005లో ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఏదేనా ఇబ్బంది కలిగినప్పుడు పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలి, కోర్టులను ఎలా ఆశ్రయించాలి, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, ఏపీఎం మొగిలీశ్వయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



కుప్పం మండలంలో తల్లులకు పిల్లల పాదాభివందనం



పెద్దపంజాణి : బహుమతులందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఆయన గురువారం అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనుంజయ, మాజీ సర్పంచ్ రామకృష్ణ, రాజారెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

పులిచెర్ల(కల్లూరు): పిల్లల చదువుల్లో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన గురువారం కల్లూరు హైస్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకోవాలన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

వి.కోట: పిల్లలు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కొంగాటం పంచాయతీ చింతల ఎల్లాగరం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో సీఐ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు.

పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి

కుప్పం రూరల్ : పిల్లలను మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గురువారం కుప్పం పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల దశలోనే పిల్లలు స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు సమావేశానికి వచ్చిన తల్లులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ శాంతానాగరాజు, ప్రిన్సిపాల్ దమయంతి పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి అవసరం

పుంగనూరు(చౌడేపల్లె): తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు, టీచర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు చేస్తున్న పనులను నిరంతరం గమనించాలని సూచించారు. ఎంఈవో–2 రెడ్డెన్నశెట్టి, ప్రముఖ డాక్టర్ చైతన్యతేజ, విశ్రాంత తహసీల్దార్ రెడ్డెప్ప పాల్గొన్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం రుద్రాణి ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. చౌడేపల్లె మండలంలోనూ తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు నిర్వహించారు.

పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్రకీలకం



తులసీనాథం నాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోపాటు పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకమని పలమనేరు ఎంఈవో లీలారాణి తెలిపారు. పలమనేరు మున్సిపాలిటీ, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అమ్మ పాదాలకు వందనం, అమ్మపేరిట మొక్కలు నాటడం, సహపంక్తి భోజనాలు చేపట్టారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ఇన్నాథన్, ఎంఈవో–2 బాలసుందరం, ఎస్ఎంసీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక కళామందిరంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తులసీనాథం సేవలకు గుర్తింపుగా భారత్ అభియాన్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్ ఘనంగా సన్మానించారు.

మోహన్‌బాబుకు గంగమ్మ ప్రసాదాలు



చౌడేపల్లె: సినీ నటుడు మోహన్‌బాబుకు గురువారం ఆయన అభిమాన సంఘం అధ్యక్షుడు తాతయ్య బోయకొండ గంగమ్మ ప్రసాదాలు అందజేశారు. ఆయన బోయకొండ గంగమ్మ ఆలయంలో మోహన్‌బాబు పేరిట అభిషేకాలు చేయించారు. అనంతరం తిరుపతి రంగంపేట సాయిబాబా ఆలయంలో మోహన్‌బాబును కలిసి ప్రసాదాలు అందజేసి వేదపండితులతో ఆశీర్వచనం చేయించారు.